4 నెలల సమస్యకు 90 నిమిషాల్లో పరిష్కారం



సోషల్ మీడియాలో వినతికి స్పందించిన ఆమ్రపాలి



ఎస్‌బీహెచ్ కాలనీలో రహదారి పనులు చేపట్టిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సైదాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్‌గా నియమితులైన ఆమ్రపాలి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రత్యక్ష విధుల్లో చురుకుగా ఉండే కమిషనర్ సోషల్ మీడియాలో వచ్చే సమస్యల విషయంలోనూ అంతే వేగంగా స్పందిస్తున్నారు. శనివారం ఉదయం రహదారి సమస్యపై సోషల్ మీడియాలో వచ్చిన వినతికి వెంటనే స్పందించారు. తన దృష్టికి సమస్య వచ్చిన గంటన్నర లోపే దాని పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ యంత్రాంగం అక్కడికి చేరుకొని పనులు చేపట్టింది. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్‌సీ కాలనీ సుమధుర ఎలిగెన్స్ అపార్ట్‌మెంట్స్ సముదాయం వద్ద ఉన్న రహదారిని నాలుగు నెలల క్రితం పైప్‌లైన్ నిర్మాణ పనుల కోసం తవ్వి పనుల అనంతరం అలాగే వదిలేశారు. నాలుగు నెలలుగా గుంతలమయంగా ఉన్న రహదారిపై కనీసం నడిచే పరిస్థితి లేక అపార్ట్‌మెంట్, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు, వృద్ధులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారి అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది. దీనికి తోడు దోమలు వృద్ధితో స్థానికులు ఇక్కట్లకు గురయ్యేవారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. శనివారం ఉదయం ఎస్‌బీహెచ్ కాలనీలోని రహదారి సమస్యను కాలనీవాసులు సోషల్ మీడియా ద్వారా గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి విన్నవించారు. స్పందించిన కమిషనర్ గంటన్నర వ్యవధిలో అక్కడికి జీహెచ్‌ఎంసీ సిబ్బందిని పంపారు. రెండు జేసీబీలు, ట్రాక్టర్‌తో సిబ్బంది అక్కడ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. సమస్య తెలిపిన సత్వరమే స్పందించి కాలనీలో రహదారి నిర్మాణ పనులకు ఆదేశించిన గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

చినుకులకే కునుకు కరువు!



కాలనీలో ప్రవహిస్తున్న వరద (ఫైల్)

చిన్నపాటి వర్షానికే మునిగిపోతున్న హిమపురికాలనీ

చిన్నపాటి వర్షం వచ్చిందంటే ఆ కాలనీల వాసులకు కంటిమీద కునుకు కరవవుతోంది. గత పదేళ్లుగా కాలనీవాసులు సమస్యలపై పోరాటం చేస్తున్నా ఏ ఒక్కరూ స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముంపునకు గురైనప్పుడు పరిశీలనకు వచ్చి ప్రజాప్రతినిధులు హామీలిస్తున్నారు తప్ప.. చిత్తశుద్ధితో అమలు చేయటం లేదని మన్సూరాబాద్ డివిజన్ హిమపురి కాలనీ ఫేజ్–2 వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –మన్సూరాబాద్

జడ్జెస్, సహారాస్టేట్స్‌కాలనీల మీదుగా వచ్చే వరదనీటితో పాటు ఆటోనగర్ నుంచి వచ్చే వరద కలిసి కాలనీలోని రోడ్ల గుండా పారుతూ ఇళ్లను ముంచెత్తుతుంది. అటవీశాఖ స్థలం నుంచి వచ్చే వరదనీటిని కాలనీలోకి పారేలా అటవీశాఖ ఏర్పాటు చేసిందని, దీంతో వరద ఎక్కువై కాలనీని ముంచెత్తుతుంది. హిమపురికాలనీ నుంచి డబుల్ బెడ్రూమ్ వరకు వరదకాలువ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని గత ఆరు నెలల క్రితం ప్రారంభోత్సవం చేశారు. కానీ ఇంతవరకు పనులు చేపట్టలేదు. ఇప్పటి వరకు కాలనీలో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు కాని వేయలేదు. జీహెచ్‌ఎంసీకి పన్నులు చెల్లిస్తున్న అభివృద్ధి మాత్రం చేయటం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఫైకాలనీల నుంచి వచ్చే వరద నీటితోనే ముంపు
- దృష్టి సారించాలంటున్న కాలనీవాసులు
- విస్మరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



హిమపురికాలనీలో గుంతలమయంగా ఉన్న మట్టిరోడ్డు

సొంత నిధులతో మరమ్మతులు..

కాలనీవాసులే సొంత నిధులతోనే రోడ్లకు మరమ్మతులు చేసుకుంటున్నారు. వర్షం వస్తే మట్టి కొట్టుకపోయి మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. కాలనీలోని ఓపెన్ స్థలాల్లో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. కాలనీలో వీధి దీపాలు లేకపోవడం చీకటి పడిందంటే విష సర్పాల భయంతో ఇంట్లో నుంచి కాలనీవాసులు బయటకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలనీని అభివృద్ధి చేయాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఆటోనగర్ నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు, పై కాలనీల డ్రైనేజీ మురుగు వరదనీటిలో కలిసిపోయి ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. రసాయన వ్యర్థాలతో చర్మ సంబంధిత వ్యాధులు సోకడంతో ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు.

వర్షం వచ్చిందంటే జాగారమే..



చిన్నపాటి వర్షం పడిదంటే రాత్రంతా జాగారమే. ఎప్పుడు ఇళ్లలోకి వరద వస్తుందని బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వస్తోంది.ఈ సమస్యలపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు.
– రంగనాయకమ్మ, హిమపురికాలనీ

వ్యాధులు ప్రబలుతున్నాయి



చిన్న పాటి వర్షానికే అటవీశాఖ నుంచి వచ్చే వరదనీటితో ఆటోనగర్ నుంచి రసాయన వ్యర్థాలు, పై కాలనీల డ్రైనేజీ మురుగునీరు కలిసి కాలనీగుండా పారుతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. నగరానికి శివారు ప్రాంతం స్వచ్ఛమైన వాతావరణం అని ఇంటి నిర్మాణం చేపడితే పై కాలనీల వరదతో కాలనీ మునిగిపోతుంది. ప్రజాప్రతినిధులు చొరవ చూసి సమస్యను పరిష్కరించాలి.
– డా. షేక్ సుభానీ, హిమపురికాలనీ

రీటెండర్ చేయిస్తున్నాం



హిమపురికాలనీ నుంచి డబుల్ బెడ్రూమ్ వరకు వరదకాలువ నిర్మాణానికి నిధులు రూ.6.80కోట్ల నిధులు మంజూరై టెండర్ కూడా అయ్యింది. పనులు ప్రారంభమయ్యే సమయానికి అనివార్య కారణాలతో టెండర్ రద్దయింది. రీ టెండర్ చేపడుతున్నాం. పనులు చేయమంటే అధికారులు ఎన్నికల కోడ్ అంటూ దాటవేస్తుండటంతో జాప్యం ఏర్పడింది. హిమపురికాలనీవాసుల సమస్యలను త్వరితగతిన పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటా. – కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్

నేడు ఎంపీ ఈటలకు సన్మానం

ఎల్‌బీనగర్: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌ను నేడు (ఆదివారం) సన్మానిస్తున్నట్లు ఎల్‌బీనగర్ పద్మశాలి సంఘం సభ్యులు తెలిపారు. శనివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆటోనగర్‌లోని కర్నాటి గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ప్రభాకర్‌నేత, కర్నాటి ధనుంజయ, పట్టపర్తి జ్ఞానేశ్వర్, చేరపెల్లి వర్ణలీల, కర్నాటి మాధవి, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

దిల్‌సుఖ్‌నగర్: ఇస్కాన్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణాపురం కాలనీ లో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. వేల సంఖ్యలో కాలనీవాసులు, భక్తులు పాల్గొని శ్రీకృష్ణ నామస్మరణతో పరిసరాలన్నీ మార్మోగించారు. చిన్నారులు, వృద్ధులు రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందరరెడ్డి, సొసైటీ సభ్యులు రమేష్ బాబు, రాజేశ్రీరామారావు, వెంకటేశ్వర్లు, నరహరి రావు, ఆంజనేయప్రసాద్గణేశబాబు, భరత్, శ్రవణ్,అన్నపూర్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లో కూరగాయల ధరలు టమాట రూ.50, వంకాయ రూ. 28, బెండ రూ. 40, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 48, బీర రూ. 32, క్యాబేజి రూ. 37, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 32, దొండ రూ. 35, చిక్కుడు రూ. 85, గోకర రూ. 45, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 65, ఆలు రూ. 37, దోస రూ. 19, సొర రూ. 11, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 35. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కేంద్ర మంత్రితో ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుల భేటీ



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కృష్ణాదిశేషు

ఎల్‌బీనగర్: కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డిని శనివారం కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు మర్యాదపూర్వకంగా కలిశారు. సినిమాలలో సమాజానికి హాని చేసే దృశ్యాలు, వ్యాఖ్యలను సెన్సార్ బోర్డు ద్వారా నియంత్రించవచ్చు కాని.. ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో అడ్డగోలుగా వీడియోలు పెడుతున్నారన్నారు. వాటిని నియంత్రించకపోతే భవిష్యత్‌లో యువతపై చెడు ప్రభావం చూపించే ప్రమాదం ఉందని ఈ అంశంపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా కృష్ణాదిశేషు పేర్కొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

ఎల్‌బీనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఎల్‌బీనగర్ కార్యదర్శి మీసాల స్టాలిన్ డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బీనగర్ ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22న చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సంధ్య, అరుణ్, సాయి, వంశీ, నవీన్, రమేష్, పవన్, శివ పాల్గొన్నారు.

‘భాష్యం’లో ఘనంగా ఫ్రెషర్స్ డే



చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ భాష్యం విద్యార్థుల ఫ్రెషర్స్ డే శనివారం సందడిగా జరిగింది. ప్రముఖ వైద్యులు సంతోష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సరైన నిద్ర, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జోన్–3 జడ్‌ఈఓ అంకమ్మరావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

సురభి కళాకారులకు అండగా ఉంటాం



వనస్థలిపురం: ప్రేక్షకులు వచ్చినప్పుడే కళాకారులకు ప్రోత్సాహంతో పాటు ఉపాధి లభిస్తుందని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. వనస్థలిపురం హుడా గ్రౌండ్‌లోని సురభి థియేటర్‌లో శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనకు శనివారం రాత్రి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమ నాటకాలతో సురభి కళాకారులు నాటకరంగానికి జీవం పోస్తున్నారని కళాకారులకు ప్రభుత్వపరంగా సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక నాట్యమండలి నిర్వాహకులు వేణుగోపాల్‌రావు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ‘టిమ్స్’ నిర్మాణం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



టిమ్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: కొత్తపేటలోని పండ్ల మార్కెట్‌ను ఇక్కడ నుంచి తరలించి అదే ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి (టిమ్స్) నిర్మాణం మరిచిపోలేని ఘటన అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. టిమ్స్ నిర్మాణ పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఆసుపత్రి నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. నాణ్యతా ప్రమాణాలు, పూర్తి భద్రత చర్యలు పాటిస్తూ పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులు ప్రజలకు వైద్య సేవలు అందించటం భారంగా మారటంతో జంటనగరాల్లో నలుదిక్కులా నాలుగు టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం చేపట్టటం జరుగుతుందన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకే కాక ఇతర జిల్లాల వారికి వైద్యసేవలు అందించేందుకు టిమ్స్ ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, పవన్, గట్టు శ్రీను ఉన్నారు.

దోమల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చాదర్‌ఘాట్: దోమల నివారణపై జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి సారిస్తోంది.ప్రతి రోజూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ దోమల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 జోన్ పరిధిలోని మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, చావునీ, సైదాబాద్, అక్బర్‌బాగ్ పరిధిలో ఉన్న డివిజన్‌లలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జీహెచ్‌ఎంసీ డీసీ జయంత్, ఎంటమాలజిస్ట్ ఎం.శ్రీనివాస్ అవగాహన కల్పించారు.

ఆచారాలను పాటిద్దాం



చంచల్‌గూడ: మారుతున్న కాలానికి అనుగుణంగా జీవిస్తునే మత ఆచారాలను అనుసరించాల్సిన అవసరముందని అంతర్జాతీయ కరాటే చాంపియన్, న్యాయవాది సయిదా ఫలక్ అన్నారు. చావణీలో ఇన్స్ అభయ సాదీ హిజబ్ షోరూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిజబ్ (బుర్ఖా) మహిళల భద్రత కోసమే కాకుండా జీవన విధానంలో భాగమైందన్నారు. షోరూమ్ యజమాని ఇల్యాస్ మాట్లాడుతూ..పాతబస్తీ వాసులకు కూడా అన్ని రకాల బుర్ఖాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఇక్కడ షోరూమ్ ప్రారంభించామన్నారు.

నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సీఏ రత్నాకర్

మలక్‌పేట: యువత నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ డీఏఏ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. మూసారంబాగ్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం పూర్వ విద్యార్థుల 2కె24 ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిజినెస్‌లో మెళకువలు నేర్చుకుని ఎంచుకున్న రంగంలో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల సెక్రటరీ ప్రియాంక, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ఉపాధ్యక్షుడు డాక్టర్ అప్పారావు, సీఏ రత్నాకర్, ఏట మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రామ్‌వాటర్ లైన్ పూర్తయితే ముంపు సమస్యకు పరిష్కారం

చైతన్యపురి: స్ట్రామ్ వాటర్‌లైన్ పనులు పూర్తయితే ముంపు సమస్య పరిష్కారం అవుతుందని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కమలానగర్ కాలనీ నుంచి నేతాజీనగర్ చౌరస్తా వరకు జరుగుతున్న స్ట్రామ్ వాటర్‌లైన్ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కమలానగర్ కాలనీలో నిర్మాణ పనులతో వ్యాపారులు, కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కాలనీలో ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న ర్యాంపులు, చెట్లను యజమానులే స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. కాంట్రాక్టర్ కేశవ్, కాలనీవాసులు సత్యనారాయణ, నాయకులు దాసరి జయప్రకాష్, బొమ్మరాజు సందీప్, ఆమంచ శ్రీను, తరుణ్, నాని, రఘునందన్ జోషి, టింకు, రామ్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్

నియామకం



చంపాపేట: తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శిగా చంపాపేట డివిజన్ రెడ్డిబస్తీకి చెందిన మెట్టు వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో తనను నియమించిన రాష్ట్ర సేవాదళ్ కార్యవర్గ సభ్యులకు, అధ్యక్షుడు జితేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక పూజలు



చంపాపేట: రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డి శనివారం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు రాంరెడ్డి దంపతులను ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కృష్ణా నీరు.. రోడ్డు పాలు!



నాగోల్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీ రోడ్డు నెంబర్–1 కమాన్ వద్ద గత కొన్ని రోజులుగా కృష్ణానీరు మ్యాన్‌హోల్ నుండి లీకై రోడ్డుపై ఏరులై పారుతుండంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మరింది. ఈ సమస్యపై స్థానికులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఉన్నతాధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. – నాగోలు

పేద విద్యార్థినికి చేయూత



లక్ష్మీప్రసన్నకు ఆర్థిక సాయం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ ఆదిత్య ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న నర్ల లక్ష్మీప్రసన్న చదువు నిమిత్తం ఎన్‌ఆర్‌ఐ దంపతులు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. విద్యార్థిని లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు 2022లో చనిపోగా వృద్ధురాలైన నాయనమ్మ సంరక్షణలో బాలిక ఉంటూ వనస్థలిపురంలోని శ్రీ ఆదిత్య ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్‌లో చదువుతున్న బాలిక కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న విద్యా సంస్థ చైర్మన్ డా.కేఎస్‌వీ.సుధాకర్ గత మూడేళ్లుగా ఉచిత విద్యను అందజేస్తున్నారు. ఈ క్రమంలో వనస్థలిపురం వనస్థలి హిల్స్‌లో ఉంటున్న ఐపీఎం రిటైర్డ్ ఉద్యోగి అల్లాడి లక్ష్మీనారాయణ కెనడాలో ఉంటున్న కుమార్తె, అల్లుడు రాచకొండ సుష్మా, మహేష్‌కు సమాచారం ఇవ్వగా స్పందించిన వారు విద్యార్థిని చదువుకు అవసరమైన రూ. 10 వేలు లక్ష్మీనారాయణ ద్వారా బాలికకు అందజేశారు. గతంలో కూడా ఇదే సంస్థలో చదువుకుంటున్న సాయికుమార్ చదువుకు లక్ష్మీనారాయణ ఆర్థిక సహాయం అందించగా ఆ విద్యార్థి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడ్డారని ఆదిత్య సుధాకర్ తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత



చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి

హస్తినాపురం: తప్పిపోయిన నాలుగేళ్ల చిన్నారిని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఎన్‌జీవోస్ కాలనీలో నాలుగేళ్ల చిన్నారి ఆడుకుంటూ బయటకు వెళ్లి తప్పిపోయింది. ఏడ్చుకుంటూ తిరుగుతున్న చిన్నారిని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.ఇన్‌స్పెక్టర్ వై.అశోక్‌రెడ్డి, అడ్మిన్ ఎస్ఐ మాధవరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారి తల్లిదండ్రుల వివరాలు సేకరించారు. చిన్నారి తండ్రి నదీమ్‌ను స్టేషన్‌కు పిలిపించి యనాయత్(4)ను అప్పగించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని ఆడుకునేటప్పుడు వారిని గమనిస్తూ ఉండాలన్నారు. చిన్నారి తండ్రి ఉత్తరప్రదేశ్ కావడంతో బాలికతో మాట్లాడటం కష్టమైందని అయినప్పటికీ పోలీసులు ప్రత్యేక చొరవతో కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మలక్‌పేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సెయింట్ జేవియర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ హిజ్కియా అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా హిజ్కియా మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి వాటి సంరక్షించాలన్నారు. సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. ప్రొఫెసర్స్ కాలనీ నుంచి ప్రారంభమైన ర్యాలీ మలక్‌పేట సూపర్ బజార్, శర్మ ఆసుపత్రి, అనితా నర్సింగ్ హోమ్ మీదుగా పాఠశాల వరకు కొనసాగింది.

సమయం వృథా చేయొద్దు

విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ

మీర్‌పేట: మారుతున్న కాలానుగుణంగా మార్పు అవసరమని, లక్ష్య సాధనకు సమయం వృథా చేయకుండా ముందుకు సాగాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు.శనివారం మీర్‌పేట టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఆలోచించి అడుగు వేయాలని, ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌లు, ఇంటర్నెట్ సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో విషయాలు తెలుస్తున్నాయని, కొత్త విషయాలపై పట్టు సాధించేందుకు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవడంతో పాటు సమయానుకూలంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు మాట్లాడుతూ జీవితంలో స్థిరపడ్డాక తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించుకోవాలన్నారు. చదువుతో సంపాదించిన డిగ్రీలతో పాటు విలువలు ఎంతో అవసరమని గుర్తుచేశారు.